ముందస్తుగా పన్ను చెల్లిస్తే రాయితీ

- చివరి తేదీ ఈ నెల 30
- వినియోగించుకోవాలని అధికారుల సూచన


నగర పాలక సంస్థ కార్యాలయం

రాజమహేంద్రవరం సిటీ: ముందుస్తుగా పన్ను చెల్లించేవారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించింది. ఏప్రిల్ 30వ తేదీనాటికి ఏడాది ఆస్తి పన్ను చెల్లిస్తే పన్నుపై రాయితీ వస్తుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాజమహేంద్రవరంలో ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం ప్రకటించిన రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావాలని అధికారులు పిలుపునిస్తున్నారు. కేవలం నెలరోజులు మాత్రమే ప్రభుత్వం అవకాశం కల్పించిందని ప్రజలు ముందుకు రావాలని కోరుతున్నారు. ఈ ముందస్తు పన్నులు చెల్లించేందుకు బకాయిలు లేనివారు మాత్రమే అర్హులని పేర్కొంటున్నారు. 2023-24 సంవత్సరం పూర్తి పన్నును ఏకమొత్తంగా ఒకేసారి చెల్లిస్తే పన్నులో ఐదు శాతం రిబేటు ఇవ్వనున్నామన్నారు. నగరంలో మొత్తం గృహ యజమానులు 76,490 మంది ఉండగా రూ.45.6 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే వీరిలో బాకీ పడిన వారిని తీసివేయగా 63,492 మంది యజమానులు రూ.38.54 కోట్ల ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ప్రకటించడంతో రూ.1.9 కోట్ల ఆదాయం కోల్పోతుంది. నగర ప్రజలు ముందుకు వచ్చి ఐదు శాతం రాయితీ వినియోగించుకుంటే రూ.36.64 కోట్ల మేర నగర పాలక సంస్థకు పన్నులు వసూలు అవుతాయి. నగరంలో 4,371 ఖాళీ స్థలాలు ఉండగా రూ.7.69 కోట్లు రావాల్సి ఉంది. అయితే వీరిలో బకాయి పడ్డ యజమానులను తీసివేయగా అర్హత కలిగిన 1,747 యజమానులు ఖాళీ స్థలాలకు రూ.4.9 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. వీరు చెల్లింపులు జరిపితే రూ.4.6 కోట్ల ఖాళీ స్థలాల ద్వారా ఆదాయం సమకూరుతుంది. రాయితీ కల్పించడం ద్వారా రూ.24 లక్షల ఆదాయం నగరపాలక సంస్థ కోల్పోతుంది. ప్రభుత్వం బకాయిలపై వడ్డీ మాఫీ ప్రకటిస్తూ మార్చి నెల చివరి వరకూ అవకాశం ఇవ్వడంతో నగరంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నుదారులు రూ.77 కోట్లు చెల్లింపులు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటిపన్ను, ఖాళీస్థలాల పన్ను, వడ్డీ మాఫీ ప్రకటించడంతో ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.

రాయితీ పొందండి



నగరంలో గృహ, ఖాళీ స్థలాల యజమానులు 65,239 మంది ముందస్తు చెల్లింపులకు అర్హత కలిగి ఉన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రాయితీ ద్వారా యజమానులు ఆర్థికంగా లబ్ధిపొందే అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– శ్రీనివాసరావు, రెవెన్యూ మేనేజర్, నగర పాలక సంస్థ

నగరాభివృద్ధికి సహకరించండి



ముందస్తు చెల్లింపులు చేపట్టడం ద్వారా నగరాభివృద్ధికి సహకరించాలి. ఆస్తి యజమానులు చేసిన చెల్లింపుల ద్వారా నగరాభివృద్ధి సాధ్యమవుతుంది. యజమానులు సకాలంలో చెల్లింపులు చేయడం ద్వారా ఈ నిధులతో నగరంలో కూడళ్ల అభివృద్ధి, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపడతాం.

–దినేష్‌కుమార్, కమిషనర్, నగర పాలక సంస్థ

క్లుప్తంగా

తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్


బ్రౌన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గరికపాటి తదితరులు

ప్రకాశం నగర్ : తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ అని పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన బ్రౌన్ మందిరాన్ని సందర్శించారు. బ్రౌన్ తైలవర్ణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. శ్రీ సన్నిధానం సంచికను విడుదల చేశారు. బొల్లాప్రగడ ఉదయభాను రాసిన 'ఉదయ భావనలు' కవితా ఖండిక'ను గరిపాటికి బహూకరించి ఘనంగా సత్కరించారు.

చిత్రకారుడు బాపిరాజుకు మరో రికార్డ్



కంబాలచెరువు: నగరానికి చెందిన చిత్రకారుడు ఎస్ కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు డాక్టర్ పుప్పాల బాపి రాజు వెస్ట్ బెంగాల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించారు. వివరాలను ఆయన ఆదివారం తెలిపారు. వెస్ట్ బెంగాల్ బుక్ ఆఫ్ రికార్డ్ 2023లో తన పేరు నమోదయిందని ఆ సంస్థ నుంచి వర్తమానం అందిందని తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రజలకు ఆ వ్యాధిపై అవగాహన కల్పించే నిమిత్తం వేసిన చిత్రాలు ప్రాచుర్యం పొందడంతో ఈ చోటు దక్కిందన్నారు.

'మనలో మాట' ఆవిష్కరణ

సీటీఆర్ఐ: సీనియర్ పాత్రికేయులు భోగాది వెంకటరాయుడు నెల్లూరుకు చెందిన 'లాయర్' పత్రికలో రాసిన వర్తమాన కథనాల సంకలనం 'మనలో మాట' పుస్తకావిష్కరణ స్థానిక మోరంపూడి జంక్షన్ శుభమస్తు మినీ కల్యాణ మందిరంలో ఆదివారం జరిగింది. సభను పాత్రికేయులు వీఎస్ఎస్. కృష్ణకుమార్ నడిపించారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ కె.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, అశోక్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

6 నుంచి ప్రతి ఇంటికి బీజేపీ

ప్రకాశం నగర్ : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 14 వరకు ప్రతి ఇంటికి బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలేపు సత్యసాయిరాం తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పోస్టర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు , ఓబీసీ జోనల్ ఇన్‌చార్జి కురగంటి సతీష్ ఆవిష్కరించారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్ : మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టబోయే చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను ఆదివారం స్థానిక శ్యామల సెంటర్‌లో సీఐటీయూ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు.

శ్యామలాంబ ఆశీస్సులు అందరిపై ఉండాలి

సీటీఆర్ఐ: జగజ్జనని శ్రీ శ్యామలాంబ (సోమాలమ్మ) చల్లని కృపా కటాక్షాలు నగర ప్రజలందరిపైనా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని గీతా అప్సరా థియేటర్ సమీపంలో గల శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆలయానికి వచ్చిన ఎంపీ భరత్ కు ఆలయ కమిటీ స్వాగతం పలికింది. ఆయనను, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరిని ఆలయ కమిటీ తరఫున సత్కరించారు.

14న భారత్ బచావో

ప్రకాశం నగర్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14న నరేంద్ర మోదీ హటావో- భారత్ బచావో పేరుతో ఆందోళన నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఓబులేసు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై కక్ష సాధింపు ధోరణి ప్రజాస్వామ్య మనుగడకి విఘాతం కలిగిస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీ కొండలరావు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పాల్గొన్నారు.

కరోనా వారియర్లకు సత్కారం

ప్రకాశం నగర్ : ప్రజాపితా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీపురంలో డివైన్ మెడిటేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరోనా వారియర్స్ పతంజలి శ్రీనివాస్, డీహెచ్‌వో రమేష్ కిషోర్‌ను సత్కరించారు. బ్రహ్మకుమారి హేమ మాట్లాడుతూ శరీరానికి యోగా ఎంత అవసరమో, జీవితంలో వచ్చే మానసిక పరిస్థితులను ఎదుర్కోవడానికి రాజయోగా మెడిటేషన్ అంత ఉపయోగపడుతుందన్నారు.

సాహిత్యం అభ్యుదయం వైపు నడపాలి


గోదావరి నానీలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అరసం సభ్యులు

సీటీఆర్ఐ: యువతను అభ్యుదయం వైపు నడింపించడానికి సాహిత్యం ఉపయోగపడాలని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తూర్పు గోదావరి జిల్లా శాఖ ప్రథమ మహాసభ ఆదివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగింది. ముందుగా సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అరసం కార్యవర్గ సభ్యులు, రచయిత చెరుకుమల్లి సింగారావు రచించిన గోదావరి నానీలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కన్వీనర్ పడాల వీరభద్రారవు, బొల్లినేను నాగార్జునసాగర్, కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

'సేవకు నా సహకారం ఉంటుంది'


అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులకు రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

ప్రకాశం నగర్ : సమాజ సేవకు ఎవరు ముందుకు వచ్చినా వారికి నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. గోదావరి గట్టు వద్ద గల వైఎంవీఏ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 'మనం' చారిటబుల్ ట్రస్టు తృతీయ వార్షికోత్సవానికి ఎంపీ భరత్ రామ్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, డాక్టర్ అనుసూరి పద్మలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ 'మనం' చారిటబుల్ ట్రస్ట్ మూడేళ్లుగా సమాజ సేవలో గుర్తింపు పొందిందన్నారు. ఈ ట్రస్టులో 1,300 మంది సభ్యులు ఉండటం విశేషమన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులకు ట్రస్ట్ ద్వారా రూ.లక్ష చెక్‌ను ఎంపీ భరత్‌రామ్ చేతుల మీదుగా అందజేశారు. నగర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, గిరజాల బాబు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థలో శ్రీరాముడు అంతర్భాగం

- ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ కాసా జయప్రద
- ఘనంగా 'ప్రత్యక్ష ఆలయదర్శిని' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వారణాసి సుబ్రహ్మణ్యం తదితరులు

సీటీఆర్ఐ: భారతీయ కుటుంబ వ్యవస్థలో శ్రీరాముడు అంతర్భాగమని, నరుడిగా జన్మించి ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మాన్ని వీడని ఆదర్శ కథానాయకుడు శ్రీరామచంద్రుడని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ కాసా జయప్రద అన్నారు. ఆదివారం స్థానిక దానవాయిపేటలోని ప్రణవకుటి నివాసంలో డాక్టర్ చల్లా సత్యవాణి రచించిన 'ప్రత్యక్ష ఆలయ దర్శిని- శ్రీసీతారామాంజనేయ దేవాలయాలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. డాక్టర్ చల్లా సరస్వతి నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఆమె సోదరి చల్లా సత్యవాణి ఈ కార్యామాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక సమీక్ష నిర్వహించిన జయప్రద మాట్లాడుతూ సత్యవాణి ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమన్నారు. గౌరవ అధ్యక్షుడిగా పాల్గొన్న మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ రామాయణ ఫలశ్రుతిలో ఈ గ్రంథ పారాయణ వల్ల కుటుంబ, ధనధాన్యాభివృద్ధి కలుగుతుందని ఉందన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహితీ వేత్త వారణాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాలతో పాటు మారుమూల గ్రామాలలో ఉన్న ఆలయాల గురించి కూడా రచయిత్రి వివరించడం అభినందనీయమన్నారు. చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థపాక కార్యదర్శి పెరుమాళ్ల రఘునాథ్ సంచాలకత్వం వహించగా రాజమహేంద్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. సహస్ర పున్నముల దర్శనం చేసుకున్న తాడేపల్లి భానుమతిని సత్కరించారు.

ముంచెత్తిన వాన

కడియం: మండలంలోని కడియపులంక, వేమగిరి, పొట్టిలంక గ్రామాల్లో వర్షం ముంచెత్తింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండతో ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయింది. భారీ మెరుపులతో కూడిన వర్షం ముంచెత్తింది. కడియం, వీరవరం, మాధవరాయుడుపాలెం తదితర చోట్ల ఒక మోస్తరు జల్లులతో సరిపెట్టింది. దుళ్ల తదితర గ్రామాల్లో చిరు జల్లులు మాత్రమే వచ్చాయి. నర్సరీలు, ఉద్యాన పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. అయితే ఈదురు గాలులతో కూడిన, వర్షం కురిస్తే వరిచేలకు మాత్రం ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఊడ్పులు ఆలస్యమైన కడియం ఆవ ప్రాంతంలోని దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ప్రస్తుతం వరి చిరుపొట్ట దశలో ఉంది. ఒకవేళ భారీ వర్షం కురిస్తే గింజల్లో తాలుశాతం పెరిగిపోతుందని, దాంతో దిగుబడి తగ్గిపోతుందని రైతులు వివరిస్తున్నారు. దీనికి తోడు వర్షం, ఎండ కలగలిసిన వాతావరణం ఉంటే ఉక్కపోతలు పెరుగుతాయని, దీంతో వరిపై తెగుళ్ల వ్యాప్తి కూడా వేగంగా ఉంటుందంటున్నారు.

చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తలే కావాలి

- వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలు
- ఎంపీ భరత్‌రామ్


సభలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు

సీటీఆర్ఐ: పేదల పార్టీ వైఎస్సార్ సీపీకి సుశిక్షితులైన సైనికుల మాదిరిగా నిస్వార్థంగా చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తలు చాలా అవసరమని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. అటువంటి వ్యక్తులు ఎక్కడున్నా పార్టీలో సముచిత స్థానమిచ్చి గౌరవిస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పితా రామకృష్ణకు ఆదివారం రాజమండ్రి ఆనంద్ రిజెన్సీ పందిరి ఫంక్షన్ హాల్‌లో పెద్ద ఎత్తున అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ భరత్‌రామ్, రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, విశిష్ట అతిథిగా నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ పితా రామకృష్ణ వంటి చురుకైన యువకులు పార్టీకి చాలా అవసరం అన్నారు. త్వరలోనే నగరంలోని 42 డివిజన్లలో యువజన కమిటీలను వేసి పార్టీని పటిష్టపరచాల్సిన అవసరం ఉందని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి నగరంలో పార్టీకి మరింత జవసత్వాలు తీసుకురావాలని ఎంపీ భరత్ రామ్ కోరారు. అమ్మ లాంటి పార్టీకి ఎవరు ద్రోహం చేసినా వదిలేది లేదని హెచ్చరించారు. వచ్చే సంవత్సరంలో జరగబోయే ఎన్నికలలో కచ్చితంగా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలన్నారు.

బ్లేడ్ బ్యాచ్‌ను ఉపేక్షించేది లేదు

నగరంలో కొన్ని డివిజన్లలో పర్యటిస్తున్నప్పుడు మహిళలు బ్లేడ్ బ్యాచ్ గురించి భయం భయంగా నాకు ఫిర్యాదు చేస్తున్నారని ఎంపీ భరత్‌రామ్ తెలిపారు. ఇదే విషయమై ఎస్పీకి తరచూ ఫోన్ చేసి చెబుతున్నానన్నారు. బ్లేడ్ బ్యాచ్ విషయంఎస్పీ కూడా చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారని, సంఘ విద్రోహశక్తుల ఆట కట్టిస్తారన్నారు. పితా రామకృష్ణ ఆ పదవికి న్యాయం చేయగలడని నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంతకు ముందు వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయం నుంచి ఆనంద్ రిజెన్సీ పందిరి ఫంక్షన్ హాల్ వరకూ భారీ ర్యాలీతో ఎంపీ భరత్‌రామ్‌ను తీసుకువెళ్లారు. గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిన భవానీ ప్రియ, వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఖాదీ బోర్డు వైస్ చైర్‌పర్సన్ పిల్లి నిర్మల, కడలి వెంకటేశ్వరరావు, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మార్గాని సురేష్, బర్రె కొండబాబు, పోలు విజయలక్ష్మి, మార్గాని చంటిబాబు పాల్గొన్నారు.

ముందస్తు లేదు...

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలనేది కేవలం ప్రచారం మాత్రమేనని, అందులో వాస్తవం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎంపీ భరత్ రామ్ చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలూ సంతోషంగా ఉన్నారన్నారు.

ఘనంగా మట్టలాదివార వేడుకలు


రక్షణాలయం వద్ద మట్టలతో ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు


దామిరెడ్డిపల్లిలో సంకీర్తన నిర్వహిస్తున్న విశ్వాసులు

సీటీఆర్ఐ: నగరంలో మట్టలాదివార వేడుకలు ఘనంగా నిర్వహించారు. బైబిల్ మిషన్, రాజమండ్రి కెథిడ్రాల్, గోల్డెన్ జూబ్లీ, స్వస్థత శాల మందిరాల సంయుక్త ఆధ్వర్యంలో మట్టలాదివారం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎం.విజయరాజు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పురవీధుల గుండా క్రైస్తవ విశ్వాసులు మట్టలు చేత పట్టుకుని భారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రభువు ఎరుషలేము ప్రవేశించేటప్పుడు ప్రజలందరూ మట్టలు చేత పట్టుకుని జయోత్సవాలతో ఆహ్వానించారన్నారు. దానికి నిదర్శనంగా నేడు ప్రపంచ దేశాలలో ఈ వేడుకలు జరుగుతున్నాయని తెలిపారు.

విశ్వాసుల ప్రత్యేక ప్రార్థనలు

కడియం: మండలంలోని క్రైస్తవ విశ్వాసులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని తెలుపు రంగు దుస్తులు ధరించి, ఖర్జూరపు మట్టలు చేతబూని గ్రామాల్లో సంకీర్తనలు చేశారు. క్రీస్తు ఘనతను చాటారు. మండలంలోని వేమగిరి, కడియపులంక, దుళ్ల తదితర గ్రామాల్లో విశ్వాసులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. దామిరెడ్డిపల్లిలో బైబిలు మిషను మహిమ మందిరం రెవ డాక్టర్ డి.రత్నరాజు ఆధ్వర్యంలో యూత్ సభ్యులు, సన్నిధి స్త్రీలు, చిన్నారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. దావీదు కుమారుడా నీకు జయముజయము అంటూ గ్రామ సంకీర్తనం నిర్వహించారు. నరమామిడి సజీవమణి, సంపర రాణి, సరోజిని, మాధురి, కొండేటి ప్రసాద్, ప్రవీణ్, రాజు, వివేక్, వినోద్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలులో ఉన్న గ్రేస్ గాస్పెల్ మినిస్ట్రీస్ వారి క్రీస్తు కృపా సంఘం రెవ పి.టాటా విక్టర్, సుగుణ ఆధ్వర్యంలో సంఘ విశ్వాసులతోను, సండే స్కూల్ పిల్లలతో మట్టలఆదివారం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మట్టలు పూలతో అలంకరణ చేసి పలు వీధుల గుండా హోసన్నా జయం జయం అంటూ ఉత్సవాలు చేసి క్రీస్తే రాబోయే రారాజు అనే శుభవార్తను ప్రకటించారు. సంఘ పెద్దలు, యూత్, స్త్రీలు పాల్గొని విజయవంతం చేశారు. మట్టల ఆదివారం సందర్భంగా ఏపీఎస్ఈబీ జనరల్ మేనేజర్ సిద్దెల రాజబాబు, పద్మారాజబాబు ముఖ్య వర్తమానం అందించారు. రూరల్ నియోజకవర్గాల్లో పలు చర్చిల్లో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని విశేష పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

పేపరు మిల్లు ఉద్యోగి మృతితో శ్రీరామపురంలో విషాదం

రాజానగరం: రాజమహేంద్రవరం పేపరు మిల్లు ఉద్యోగి సంగీత సత్యనారాయణ మృతితో ఆయన స్వగ్రామమైన దివాన్‌చెరువు శివారు శ్రీరామపురంలో విషాద వాతావరణం నెలకొంది. పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబ సభ్యులు, బంధువుల సందర్శనార్థం మృతదేహాన్ని శ్రీరామపురానికి ఆదివారం తీసుకువచ్చి, తదుపరి రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సత్యనారాయణ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి విదితమే. మిల్లు యాజమాన్యమే దీనికి బాధ్యత వహించాలని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాతోపాటు శ్రీరామపురం గ్రామస్తులు కూడా డిమాండ్ చేస్తున్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం ఖాయం

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి లేని అనుమతి


కొంకుదురులో విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి

బిక్కవోలు: పదోతరగతి విద్యార్థులకు నేటి నుంచి పరీక్షా కాలం మొదలవుతోంది. పరీక్షల్లో వచ్చే ప్రశ్నల ఆధారంగా కష్టపడి చదివిన పాఠాలను గుర్తు చేసుకుని జవాబులు రాయాలంటే ముందుగా విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనలను అధిగమించాలి. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి. రానున్న రెండు వారాల పాటు విద్యార్థుల దృష్టంతా చదువుపై పెట్టి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే విజయం ఖాయమని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

ఒత్తిడే సవాల్

పది పరీక్షలు అనగానే విద్యార్థుల్లో తెలియని ఆందోళన, మానసిక ఒత్తిడి ఎదురవడం సర్వసాధారణంగా కనిపించేదే.. విద్యార్థులు రోజూ తెల్లవారుజామున లేచి చదువుకోవడంతో పాటు పాఠశాలల్లో అదనపు తరగతులు ఏర్పాటు చేసి మరీ శిక్షణ ఇచ్చారు. గతంలో హిందీ తప్ప అన్ని సబ్జెక్టులకు రెండేసి పేపర్లు ఉండేవి. ఒక పేపరు సరిగా రాయకపోయినా రెండో పేపరులో మార్కులు స్కోరు చేసేలా ప్రయత్నించేవారు. ప్రస్తుతం ఒక పేపర్ మాత్రమే ఉండటంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరీక్షల వేళ ఒత్తిడికి గురవుతున్న విద్యార్థుల్ని గుర్తించి వారిలో ఆత్మవిశ్వాసం నింపాల్సిన అవసరముందని వైద్యులు చెబుతున్నారు. అలాగే విద్యార్థులకు తగినంత నిద్ర, సమతుల ఆహారం ఉండేలా సైతం జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

అనపర్తి నియోజకవర్గంలో 2,973 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయనున్నారు. వారిలో అనపర్తి మండలానికి చెందిన 844 మంది, బిక్కవోలు మండలానికి చెందిన 694 మంది, రంగంపేట మండలానికి చెందిన 618 మంది, పెదపూడి మండలానికి చెందిన 817 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసు అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయొచ్చు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ జరుగుతాయి. అయితే ఉదయం 9.30 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని బిక్కవోలు ఎంఈవో శ్రీనివాసరావు స్పష్టం చేస్తున్నారు. అందుకే విద్యార్థులు ఆఖరి నిమిషంలో హైరానా పడకుండా ఉండేందుకు ఉదయం 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవడం మంచిది.

తగినంత నిద్ర, ఆహారం అవసరం



పరీక్షల సమయంలో విద్యార్థులకు సహజంగానే ఒత్తిళ్లు ఏర్పడతాయి. అందుకే తగినంత నిద్ర, సాత్వికమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరం. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టినా రోజుకు కనీసం ఏడు గంటల పాటు ప్రశాంతంగా నిద్రపోవాలి. గాఢ నిద్ర వల్ల చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తమవుతాయి.

– తేతలి రామారెడ్డి, మానసిక వైద్యులు, అనపర్తి

తల్లిదండ్రులే విద్యార్థుల్ని కేంద్రాలకు చేర్చాలి



పరీక్షల సమయంలో విద్యార్థుల ఆలోచనలు, ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు, బంధువులే పరీక్షా కేంద్రాల వద్ద వారిని వదిలిపెట్టడం మంచిది. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి.

– బుజ్జిబాబు, ఎస్ఐ, బిక్కవోలు

ఎంటర్‌పెన్యూర్స్‌కు ఉపయోగం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎక్స్-కనెక్ట్ ప్రోగ్రాం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కలయిక ఎంటర్‌పెన్యూర్లకు ఉపయోగకరంగా ఉంటుందని కార్యక్రమ నిర్వాహకుడు చరణ్‌సంజీవ్ తాడిమళ్ళ అన్నారు. రాజమహేంద్రవరం నగరంలో ఆదివారం ఒక హోటల్‌లో విజన్ టాక్స్ ఆధ్వర్యంలో ఎక్స్- కనెక్ట్ ప్రోగ్రామ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కలయిక జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కలిసి వారి అనుభవాలను, ఆలోచనలను పంచుకున్నారు.

సినిమాలు



శ్యామల	: భోలా
సూర్యమినీ	: డంజన్స్‌డ్రాగన్స్
సూర్యప్యాలెస్	: దసరా
స్వామి	: దాస్‌కాధమ్కీ
అశోక	: దసరా
శివజ్యోతి	: రంగమార్తాండ
అనుశ్రీ	: దసరా
రాజా	: దసరా
ఊర్వశి	: సత్యంవధ-ధర్మంచెర, దహనం
రంభ	: డంజన్స్‌డ్రాగన్స్
గీతాఅప్సర	: దసరా
నామవరం	
వీఎస్.మహల్	: దసరా
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ	: దసరా